**పిడికెడు అన్నం పెట్టినందుకు మనిషి కృతజ్ఞత చూపుతాడు. అలాంటప్పుడు గవర్రాజు మనిషేనా?**

# కృతఘ్నత...

## చంద్రశేఖర్

**వేసవి ఎండలు కావడం మూలాన సాయంత్రం కావస్తున్నా వాతావరణంలో వేడి తగ్గలేదు. కొత్త సినిమా ఆ రోజే విడుదల కావడంతో అలంకార్ థియేటర్ జనంతో కిటకిటలాడుతోంది. విద్యుత్ దీపాల వెలుగు ఆవరణంతా పరుచుకుని వుంది. బారులుతీసిన లైన్లు, హడావుడిగా తిరుగుతున్న మనుష్యులతో అక్కడ పెద్ద సంతలా తయారైంది.**

టిక్కెట్లు ఇవ్వడానికి యింకా ఓ అరగంట సమయం వుంది. హాలుకి ఎదురుగా కుళ్ళు కాలువ. మీదున్న టీ బడ్డీలో తీరుబడిగా కూర్చుని టీ తాగుతున్నాడు పోలీసు గవర్రాజు. టిక్కెట్లకోసం జనం తొక్కిసలాడుకోకుండా చూడ్డానికి వచ్చాడు గవర్రాజు

"సినిమా ఎలాగుందేటి?"

వక్షంమీద పైట తప్పుకున్న టీ చేస్తున్నామెవైపు చూస్తూ అడిగాడు.

"ఏమోగాని జయమాలిని మాత్రం అదరగొట్టేసిందంటున్నారు." రెండు మగ్గుల్లో టీని పైకి కిందకి కలుపుతూ అంది. ఆమె మగ్గుతో టీ పైకి ఎత్తినపుడు వక్షం లయను చూసిన గవర్రాజు గుటక మింగాడు.

"అందుకే గదా యీ ఎర్రినా కొడుకులు ఇలా తొక్కిసలాడుకుని చస్తున్నారు.

"పోసీ గాని మావోడు టిక్కెట్లకెళ్ళినాడు చూడు!"

తన ప్రక్కనున్న వాడికి టీ యివ్వడానికి వచ్చిన ఆమె చెమట వాసన గుప్పుమని తగిలేసరికి ఉక్కిరిబిక్కిరి అయ్యాడు గవర్రాజు. చెమటతో తడిసి మెరుస్తున్న నడుం దగ్గర మడతలు వక్ష తొనలను చూసి ఆఖరి టీ చుక్కలను చప్పరించాడు.

"అందుకేగదా నేనిక్కడే వుండిపోయింది" వంపులు తిరిగిన ఆమె వెనుక పోర్షన్ ఆశగా చూస్తూ అన్నాడు. సినిమా టిక్కెట్లు యివ్వడం మొదలు పెట్టేవరకూ గవర్రాజు టీ దుకాణంలోనే వున్నాడు. బ్లాకులో టిక్కెట్లు అమ్మేవాళ్ళంతా క్యూ మొదట్లో దూరినవరకూ ఆగి, తొక్కిసలాట, జేబులు కొట్టడాలు జరిగిన తరువాత బ్లాకువాళ్ళందరికీ టిక్కెట్లు దొరుకుతాయని నమ్మకం కుదిరాక టిక్కెట్లు యిచ్చే స్థలం దగ్గరకు వచ్చాడు పోలీసు గవర్రాజు.

"యెధవ నాకొడుకు ఎప్పుడు వచ్చాడో చూడు!"

"లుచ్ఛానాకొడుకులు-బ్లాకోళ్ళకు వీళ్ళకు కనక్షన్ వుంటుంది."

"లాబూచీ వెధవలు."

తొక్కిసలాటలో లైనుముందువున్నవాళ్లు వెనకైపోవడంతో అతనికి వినబడకుండా గవర్రాజుని తిట్టుకుంటున్నారందరూ. ఆశ చావక టిక్కెట్లు దొరుకుతాయన్న నమ్మకంతో యింకా "క్యూ"లో నిల్చున్నవాళ్లు గవర్రాజుని పురుగుని చూసినట్లు చూశారు.

కాని, పోలీసు గవర్రాజు పురుగులా వుండడు. మనిషినెత్తురు మరిగిన పులిలాగనే వుంటాడు. వొత్తుగా కలిసిపోయిన రెండు కనుబొమ్మల మధ్యనుంచి తొంగిచూస్తున్న పిల్లికళ్లు—ఎత్తుగా ఉబ్బినట్లు కనిపించే దవడ ఎముకలు—కన్నాలు తెగిపోయిన చెవులు—బుగ్గమీసాలు — గిరజాల జుత్తు—ఖాకీ యూనిఫారంలో కర్కోటకుడిలాగానే కన్పిస్తాడు గవర్రాజు.


గవర్రాజు వెళ్ళిన పది నిముషాలకు అన్ని క్లాసుల టిక్కెట్లు యివ్వడం అయిపోయింది. బుక్కింగుల్సు అన్నీ మూసేశారు. టిక్కెట్లు దొరకని వాళ్ళంతా నిరుత్సాహంతో, జిడ్డు ముఖాలతో తిరిగి వెళ్ళిపోయారు. జేబులో డబ్బులు లెక్కలేని జల్సారాయుళ్లు మాత్రం బ్లాకులో టిక్కెట్లు కొనే ప్రయత్నంలో పడ్డారు. మనసులో ఉత్సాహం చంపుకోలేని కొందరు మాత్రం జయమాలిని సెక్సు బొమ్మలను చూస్తుండిపోయారు.

మరో అరగంటలో అక్కడ వాతావరణమంతా సద్దుమణిగింది.

ఆట మొదలైన తరువాత హాలు ప్రక్క సందులో వెలగని లైటుక్రింద గుంటనక్కలా కాచుకునికూచున్నాడు గవర్రాజు బ్లాకులో టిక్కెట్లు అమ్మిన వారంతా అక్కడకు చేరారు.

"ఏందిరా యీ రోజు గిరాకీ బాగున్నట్టుంది."

తొక్కిసలాటలో వాళ్ళంతా హూనమైపోయి, చెమటతో జిడ్డు కారుతూ, బండబారిపోయిన చూపులతో, నక్కలు చీకిన దుమ్ముల్లావున్న వాళ్ళలో ఏ చలనమూ లేదు. వాళ్ళల్లో వొకడు అందరి దగ్గరా డబ్బులు దండి, గవర్రాజు కిచ్చాడు.



గవర్రాజు చిన్నగా నవ్వుకున్నాడు. మీసాల మధ్యనుంచి వచ్చిన అతని నవ్వు చీదేసిన సిసింద్రీ శబ్దంలా వచ్చింది.

"ఎంట్రా పాతిక టిక్కెట్లు కదురా.... పదిహేను తక్కువిచ్చావేం?"

"చిత్తం....బుక్కింగులో టిక్కెట్టిచ్చినోడు అలాగే యిమ్మన్నాడు."

"ఏరా సూరిగా! నా దగ్గరే వేషాలేస్తున్నావా? మధ్యలో వాడెవడ్రా ఇమ్మని చెప్పడానికి" చీకటిలో చీల్చుకుని చూస్తూ అన్నాడు.

"కాదండి....ఆడికూ్కడ మీలాగే కమీషన్ కావాలంటున్నాడు...."


గవర్రాజుకి చిర్రెత్తుకు వచ్చింది.

"ఏట్రా కూస్తున్నావు....వాడి కివ్వడానికి నాకు తగ్గించడానికి కనెక్షనేట్రా? మక్కలిరగదన్ని బొక్కలో తోసెయ్యగలను....మర్యాదగా యిచ్చెయ్యి."

సూరిగాడు వచ్చే చిరాకుని అణుచుకున్నాడు. "మీకిచ్చే మధ్యలో ఆడికీ యిచ్చి....యికమిగిలింది మాకేటండి....?"

పోలీసు గవర్రాజు వెటకారంగా నవ్వాడు....

"మక్కలిరగ దంతాను .... డబ్బులు తియ్యరా తియ్యి!"



గవర్రాజు సంగతి సూరిగాడికి తెలుసు. ఎవరిది వారికి ముట్టజెప్పిన తరువాత వాడికి మిగిలింది అతి స్వల్పం—అది వాడిశ్రమకు సరిపోనిదనే చెప్పాలి!

"ఈ రోజు కొదిలేయండీ.... రేపు యిచ్చుకుంటాం."

గవర్రాజు కోపం ఆపుకోలేకపోయాడు. విసుగా సూరిగాడి జుత్తు పట్టుకున్నాడు. మిగిలిన వారు శాపగ్రస్తుల్లా చూడ్డం తప్ప యేం చెయ్యలేకపోయారు.

"నా దగ్గరే మాయలు చేస్తావురాముండా కొడకా....పోలీసు గవర్రాజు తడాఖా మరిచిపోయావురా?" లాఠీతో వాణ్ణి బాది రావల్సిన డబ్బులు రాబట్టుకున్నాడు గవర్రాజు. బండబూతులు తిట్టుకుంటూ వెళ్ళిపోతున్న వాణ్ణి చూసి సూరిగాడు, వాడి అనుచరులు అలసిపోయిన గుండెలతో శపిస్తూ మిగిలిపోయారు—చీకటిలో.

పోలీసు గవర్రాజు తిన్నగా వైన్‌షాప్‌కి నడిచాడు. గవర్రాజుకి యూనిఫారం వుండగా తాగడం అలవాటుంది. యూనిఫారమ్ వుండగా చెయ్యకూడని పనులు చాలా చెయ్యగలడు. అందుకే మత్తుగా తాగి బయటపడ్డాడు.

గవర్రాజుకి ఎంత తాగినా తొణక్కుండా, బెణక్కుండా నడువగల కెపాసిటీ వుంది. ఫుల్‌గా తాగిన తరువాత అతని నరాల్లో కొత్తరకం తీట బయలుదేరింది. మత్తులో వున్న శరీరానికి ఆకలి పుట్టింది. మెదడులోని ఆలోచనలతో కామపిశాచం ఆవరించింది.

ఎలాగైనా యీ తీట తీర్చుకోవాలనుకున్నాడు. వెంటనే ఆవూరు కొత్తగావచ్చిన వరాలు కంపెనీ గుర్తుకువచ్చింది— యింకా ఆ కంపెనీ పోలీసుల దృష్టిలోకి రాలేదు. ఎప్పుడూ అదేవేటలోవున్న గవర్రాజు మాత్రం కనిపెట్టేశాడు.

"వారేయ్.... వరాలు కంపెనీకి పోనియ్యరా!" జంక్షన్‌లోవున్న రిక్షా యెక్కాడు. వెధవ అరువుబేరమని తిట్టుకుని యీసురోమనితొక్కుకుంటూ అటువైపు పోనిచ్చాడు రిక్షావాడు.

పది నిముషాల్లో ఓ ఇరుకు సందులో చీకటిలో ఆగింది రిక్షా! "వచ్చిన వరకూ ఆగరా!"

రిక్షావాడికి చెప్పి ఓ ఇంటి ముందుకు వెళ్ళి తలుపుతట్టాడు గవర్రాజు.

"ఎవరూ...." లోపలి నుంచి చిన్న కేక విన్పించింది.

"ఎవర్తే అది!.... తలుపు తియ్యవే లంజకనా!"

పళ్లు పట పట కొరుకుతూ అరిచాడు గవర్రాజు.

తలుపులు తెరుచుకున్నాయి. తలుపులు తీసినామె గవర్రాజును చూడగానే గతుక్కుమంది.

"ఏందే....నువ్వేనా వొనరువి?"

లోపల అడుగు పెడుతూ అడిగాడు గవర్రాజు.

"అవును!"

పోలీసోళ్ళ సంగతి తెలిసిన వరాలు కొంచెం నిబ్బరపడింది. కాకపోతే అప్పుడే తన కంపెనీని పోలీసోళ్లు పసిగట్టారన్న బాధ మాత్రం పోలేదామెకు.

"ఎలాగుందే యాపారం.... బేరాలు బాగున్నాయా?"

వరండాలోవున్న బల్లమీద కూర్చుంటూ అడిగాడు.

గుడ్డివెల్తురు దీపం.... నానా రకాల మచ్చలతోవున్న గోడలు.... గబ్బు వాసన. ఆ వాతావరణం చాలా అసహ్యంగా వుంది.

"ఏదో మీబోటోళ్ళదయతో బాగనే వుంది."

గవర్రాజు సిగరెట్టుతీసి వెలిగించి గట్టి దమ్ములాగి వదిలాడు.

"మా సెడ్డ బులుపుగుందే.... మంచి గుంటను చూపించు...."

వాడిపీడ యిలా విరగడైపోతే పరవాలేదనుకుంది వరాలు.

"మీ కంటేనా .... ఓ గడియాగండి."

"ఎందుకే...."

"కొత్త యాపారం.... అమ్మాయిలు ముగ్గురే....అందరూ బేరాల్లో వున్నారు."

కాని గవర్రాజు ఓ క్షణంకూడా ఆగే

మీకు బేబి బాబు కావాలా



ఆపరేషన్, ఇతర వైద్య చికిత్సలతో నిరాశ చెందిన సోదరీమణులు అనేకులు మా మందులచే సంతానవతులయి ఇచ్చిన యోగ్యతా పత్రములు గలవు. స్త్రీ పురుష సంతానలోప నివారణ నిపుణులు. ఉచిత వివరములకు

శ్రీ నాగార్జున మూలిక కుటీరం,

రామాలయంవీధి. 2వ లైను. కేదారేశ్వరపేట

తెనాలి—2. విజయవాడ—3

సైంటిఫిక్ కాలిక్యులేటర్లు

10 అంకెల సైంటిఫిక్ కాలిక్యులేటర్లు విద్యార్థులకు ప్రత్యేక తగ్గింపు.

సంప్రదించండి :

సోనో విజన్,

విజయవాడ—2.

SUVARNA

గ్రాడ్యుయేట్ కాలేరా?
బి.ఎ./బి.కామ్ ఎంట్రన్స్

ఎట్టి పరీక్షలు లేకుండా 20సం॥ నిండిన వారు ఒక్కసంవత్సరంలో ఎంట్రన్స్ వ్రాసి (ANDHRA UNIVERSITY) BA/B.COM ఇంగ్లీషు/తెలుగు మీడియంలో చదువవచ్చును అత్యున్నత పోస్టల్ ట్యూషన్ ... తెలిక పద్ధతిలో వ్రాయ ... తక్కువ ఫీజు వివరములకు ప్రాస్పెక్టస్‌ను రూ. 3/- పంపు.

DIRECTOR

SREE LAXMI TUTORIALS

VELPULAVARI St. WAHAB CHOWK

TENALI-522 201 (A.P.)


స్థితిలోలేదు. కోర్కెతో శరీరం పిచ్చి కుక్కలా అవుతోంది. మనసు భారంతో మూలుగుతోంది. వరాలువైపు చూశాడు.

వరాలు నడివయస్కురాలైనా శరీరం పంపులు తిరిగి పిటపిట లాడుతూంటుంది. నలుపే అయినా ఆ చిన్న కాంతిలోకూడా నూనె రాసినట్లు కొవ్వుపట్టిన శరీరం మెరుస్తోంది. వక్షం బరువుతో జబ్బలు ముందుకు వంగినట్లు కన్పిస్తున్నాయి.

గవర్రాజు మనసు గిలగిల లాడింది. కామవాంఛ విషసర్పంలా బుసలు కొట్టింది. తటాలున వరాలు నందుకుని వడిలోకి లాక్కున్నాడు. అనుకోని పరిణామానికి ఏదో అనబోతున్న వరాలుకి మాటలు పెగల్లేదు.

"ఎవరో ఎందుకే.... నువ్వు చాలు తన్నదియ్యా పిటపిటలాడుతున్నావు"

వరాలుకి తప్పించుకోవాలన్న ప్రయత్నం విఫలమైంది.

"కాదండి.... మా వోడుంచుకున్న దగ్గర్నుండే యీపని మానేశాను.... ఓ గడియాగండి మంచిపిల్లను చూపిస్తను". ఏమీ వినే స్థితిలో లేడు గవర్రాజు. తపనతో చేతులు అంత కంతకూ బిగుసుకుంటున్నాయి.

"చాల్లేవే.... లోపలికి నడు!"

వరాలు పెద్ద మీమాంసలో పడిపోయింది. గవర్రాజుకి లొంగిపోతే వుంచుకున్నోడు వూరుకోడు. ఒప్పుకోకపోతే పోలీసులు విడిచిపెట్టరని తెలుసు.

"నిన్ననే కొత్త పిల్లను కొన్నానండి.. చదువుకున్నది కూడాను!"

పోలీసు గవర్రాజు సహనం చచ్చిపోయింది.

"రూముకి నడవమంటే యెదవ కబుర్లాడతవేటి లంజికనా!" వరాలుని గట్టిగా పట్టుకునే లేచాడు గవర్రాజు. వరాలుకి యిక లొంగక తప్పిందికాదు. లేకపోతే తన వ్యాపారానికి ముప్పువచ్చేలా వుందనుకుని వో చీకటిగదికి దారితీసింది.

పోలీసు గవర్రాజు రాక్షస రతిలో వరాలుని అనుభవించాడు. ఆ సమయంలో ఆ చీకటి గదిలో అతని ఖాకీ యూనిఫారమ్ ఉరికంబంనుంచి వేలాడుతున్న శవం వూగుతున్నట్లు కొక్కెంనుంచి వేలాడుతూ వూగుతూనే వుంది.

గవర్రాజులో కామ పిశాచం నిద్రపోయేసరికి నెత్తికి ఎక్కిన మత్తు పూర్తిగా దిగిపోయింది. తిరిగి తన యూనిఫారమ్ వేసుకున్న తరువాత కర్తవ్యం గుర్తుకువచ్చింది.

వరాలు తనవంటిమీద వళ్ళ గాట్లను బాధతో తడుముకుంటూ పీచు పరుపుమీద నుంచి యింకా లేవలేదు.

చీకట్లో ఆమె శరీరం అలసటతో మూల్గుతోంది.

గవర్రాజు చీకట్లో వరాలు శరీరం తడుముతూ అడిగాడు.

"మామూలు పడెయ్యి పోతాను."

వరాల్లు గుండెలు గతుక్కుమన్నాయి. అతని స్పర్శలో ఆమెకు వళ్ళంతా పురుగులు ప్రాకుతున్నట్లనిపించింది.

"ఇప్పుడేం మామూలు.... రెండు రోజులు పోయాక రాకూడదూ!"

"మా మూలుకి ముహూర్తమేటే.... పడెయ్యి పోతాను" కాస్త కఠినంగా అన్నాడు.

"మీకు తెలియందేముంది.... వూరికి కొత్త.... బేరాలు చూస్తే...." బట్టలకోసం తడుముకుంటూ మెల్లగా నసిగింది వరాలు.

గదిలోకి వస్తూనే వరాలు తన జాకెట్టు నుంచి డబ్బులుతీసి పరుపుకింద పెట్టడం— అంత మత్తులోనూ గమనించాడు గవర్రాజు.

"చూడు వరాలు! ఈ పోలీసు గవర్రాజు దగ్గర వెధవ లంజె వేషాలు వెయ్యాలని చూడకు. ఈరోజుకివి చాల్లే.... వస్తాను."

పరుపుక్రింద డబ్బులు తీసుకుని వెళ్ళిపోతున్న గవర్రాజును చూస్తూ తెల్లబోయింది వరాలు.... ఆ డబ్బులన్నీ తనవి కావనీ అందులో అమ్మాయిల బేరాలకివ్వాల్సిన కమీషన్‌కూడా వుందని గట్టిగా అరిచి చెప్పాలనుకుంది. కాని నిస్సహాయతగా చీకటిలోచీకటి మిగిలిపోయిందివరాలు.

మళ్ళీ జేబులోకి డబ్బులు రావడంతో ఎక్కడలేని హుషారు వచ్చింది గవర్రాజుకి. కొత్త తెలుగు సినిమా పాటను బూతు మాటల్లోకి మార్చి పాడుతూ పోలీస్ స్టేషన్‌వైపు దారి తీశాడు.

ఆ వూరు యస్సై కొత్తగా వచ్చాడు. వచ్చినవాడు చాలా ఘటికుడని— ముక్కుసూటిగా పోయే మనిషని ముందే తెలుసుకున్నాడు గవర్రాజు. ఎలాగైనా కొత్త యస్సై దృష్టిలో తాను పేరు సంపాయించాలని ఆలోచిస్తూ స్టేషన్‌కి చేరుకున్నాడు గవర్రాజు.

అతను వెళ్ళేసరికి అపుడే వేను వచ్చి ఆగింది. అందులో నుంచి దిగుతున్న సూరిగాణ్ణి, వాడి ముఠాని చూసి, వెధవల్ని పట్టుకున్నారన్నమాట! అనుకున్నాడు గవర్రాజు—అయినా కొత్త యస్సై మాత్రం ఏందుకూరుకుంటాడు—

గవర్రాజు ఏమీ యెరుగనట్లు సూరిగాణ్ణి, వాడి మనుషుల్ని చూసి ఏం మాట్లాడకుండా యస్సైతో మాట్లాడానికి వెళ్ళిపోయాడు.

సూరిగాడు, వాడి ముఠా— మనసులో కారాలు, మిరియాలు నూరుతున్నా నిస్స

హాయ స్థితిలో మిగిలిపోయారు.

"సర్! వాళ్లు ఈ వూరికి పెద్ద రౌడీ వెధవలండీ. దాదాపు అన్ని సినిమాహాళ్ళ దగ్గర బ్లాకులో టిక్కెట్లు అమ్ముతారు వాళ్లు!"

యస్సైతో గవర్రాజు చెప్పిన మాటలకు సూరిగాడి కళ్ళల్లో రక్తం చిమ్మింది. గవర్రాజు వాడికి నిజంగా గుంటనక్కలాగనే కన్పించాడు.

"వెధవల్ని లాకప్‌లో వెయ్యండి...."

....యస్సై ఆజ్ఞ జారీ చెయ్యడంతో వేన్‌లో పట్టి తీసుకువచ్చిన వాళ్ళందరినీ కటకటాల వెనుక్కి తోశారు.

ఆ తరువాత కొత్త యస్సై లాడ్జి రైడింగ్‌కి బయల్దేరాడు. పోలీసు గవర్రాజు కూడా వెంట వెళ్ళాడు.

సమయం రాత్రి పన్నెండు గంటలు దాటింది. కొత్త యస్సై తన సిబ్బందితో కలిసి లాడ్జిలన్నీ రైడ్ చేశాడు. వేశ్యా కొంపలన్నీ గాలించాడు కాని, ఒక్క బ్రోతల్ కేసు దొరకలేదు. కొత్త యస్సై అసహనంగా అరిచాడు.

"చూశావోయ్ గవర్రాజు—ఆఫీసులో చూస్తే బోలెడు బ్రోతల్ కేసులున్నాయి. కాని ఈ రైడింగులో ఒక్కటీ దొరకలేదు. నా అనుమానం ఒకవేళ మనమిలా రైడ్ చెయ్యబోతున్నట్లు అందరికీ ముందుగా ఇన్‌ఫర్మేషన్ అంది వుండాలి."

కొత్త యస్సై ఆవులించకుండానే పేగులు లెక్కపెట్టగలననుకున్నాడు గవర్రాజు. "చిత్తం....అదే అయివుండాలి."

"అది మన డిపార్టుమెంట్లో జరగకూడనిది....ఈ రోజుకిక చాలిద్దాం."

యస్సైలో నిరుత్సాహం కనిపెట్టాడు పోలీసు గవర్రాజు. మనసులో వరాల కంపెనీ మెదిలింది. ఈ పళంగా రైడ్ చేస్తే కేసులు దొరకవచ్చనుకున్నాడు.

"తమరు మన్నిస్తే ఓ మాట...."

"ఏమిటది!"

"నిన్ననే కనుక్కున్నాను....ఈ వూరికి కొత్తకంపెనీ ఒకటి వచ్చింది....వెళ్తే యేమైనా కేసులు దొరకవచ్చు."

"ఏం.... అక్కడమాత్రం నమ్మకం ఏముంది?"

"చిత్తం.... కాని కేసులు దొరుకుతాయి— నాకా నమ్మకం వుంది—"

"వెరీగుడ్ గవర్రాజు.... వో....కె.... కేరియాన్...."

యస్సైలోని ఉత్సాహానికి గవర్రాజుకి హుషారు పుట్టింది. యస్సై మెచ్చుకోలు చూపుకి గర్వపడిపోయాడు కూడాను.

పోలీసు జీపు.... వేను వరాల కంపెనీ వైపు పరుగుతీశాయి. గవర్రాజు ఇంటి వివరాలు చెప్పాడు.... సందు చివర వేను ఆగడం పోలీసులు దిగి వరాల ఇంటిని చుట్టుముట్టడం కొన్ని క్షణాల్లో జరిగిపోయినయ్యి.

అనుకున్నట్లుగానే మూడు కేసులు దొరికాయి కొత్త యస్సైకి. గవర్రాజుమీద నిజంగానే గురి కుదిరింది.

గవర్రాజు మాత్రం వేన్ దిగలేదు. పట్టిన మూడుకేసుల్ని ఆడ మగా సైతం యెక్కించారు....అందులో వరాల కూడా వుంది.

వరాల పోలీసుల్ని బతిమాలుతూ ఏదో చెప్పబోయింది. కాని ఆమె గోడు వినిపించుకోలేదు సరికదా జుత్తు పట్టుకుని యీడ్చి మరీ వేన్లోకి నెట్టారు. వరాల దబ్బున వేన్ సీట్లో పడి ముందుకు తూలిపోబోయింది. కాని ముందుకు పడిపోకుండా ఎవరో పట్టుకుని కూర్చోబెట్టారు. జీపు, వేను కదిలినయ్యి పోలీస్ స్టేషన్‌వైపు దారి తీస్తూ.

పట్టుబడిన ముగ్గురమ్మాయిలు పోలీసులతో పని కొత్త కాబోలు మెల్లగా ఏడుస్తున్నారు. మగవాళ్లు ముఖం చెల్లక ముఖం చేతుల్లో దాచుకుని మౌనంగా వుండిపోయారు.

వేన్లో చీకటిగా వుంది. తాను పడిపోకుండా పట్టుకున్న దెవరో సరిగ్గా కనబడ్డం లేదుగాని....అతని స్పర్శమాత్రం ఏదో జ్ఞాపకం చేస్తోంది. వరాల యింకా అతని దగ్గరగా జరిగింది. ఇపు డర్థమైంది— రాక్షసుడిలా తన ననుభవించి.... ఆ రోజు వచ్చిన డబ్బులన్నీ ఒడుచుకున్న కానిస్టేబుల్ వాడేనని....యిదంతా చేయించిన వాడుకూడా వీడేఅయి వుంటాడనుకుంది.

వరాల హృదయం భగ్గుమంది.లావాలా మరిగింది. దెబ్బతిన్నపులి బోనులోపడ్డట్టు గిలగిలలాడింది. ఏహ్యంగా అతనివైపు చూసింది.

ఖాకీబట్టలు—ఎర్రటోపి .... కుళ్ళిన మాంసంతినే పులిలాకన్పించాడు గవర్రాజు చీకట్లో.—వరాల భరించలేక శబ్దంలేకుండా వాడి మొహంమీద కాండ్రించి తుపుక్కున వుమ్మేసింది.

